ప్రజాశక్తి
శనివారం 13 జులై 2024
5
అనంతపురం





దిక్కులేని.. విశ్వవిద్యాలయాలు..!

విసి, రిజిస్ట్రార్లు లేక పరిపాలనాపరమైన సమస్యలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పాలనాధ్యక్షుల్లేక విశ్వవిద్యాలయాలు దిక్కులేనివయ్యాయి. ఉద్యోగుల జీతాలు కూడా అందకుండా ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది. జిల్లాలో అనంతపురం జెఎన్‌టియు, శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. రెండింటిలోనూ వైస్ ఛాన్సలర్లు, రిజిస్ట్రార్లు రాజీనామాలు చేశారు. ప్రస్తుతం రెండు చోట్లా ఇన్‌ఛార్జులతో పాలన నడుస్తోంది. ఈ ఇన్‌ఛార్జిలకు కూడా పూర్తి స్థాయి అధికారాల్లేవు. కేవలం లుక్ ఆఫ్టర్‌గా పెట్టారు. కొత్తగా రెగ్యులర్ వైస్ ఛాన్సలర్లు, రిజిస్ట్రార్లు ఎప్పటికి వస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. వైస్‌ఛాన్సలర్లు ఉన్నఫలంగా రాజీనామాలు చేసి వెళ్లడం, వాటిని ఆమోదించడంతో ఇన్‌ఛార్జీల పాలన తప్పనిసరైంది. వీరికి పూర్తి స్థాయి అధికారల్లేవు. కొత్త వైస్‌ఛాన్సలర్ల నియామకం జరగాలంటే మరో నాలుగైదు నెలల సమయం పట్టే అవకాశం కన్పిస్తోంది. కొత్త వైస్ ఛాన్సలర్ల నియామకం జరగాలంటే ముందుగా సెర్చ్ కమిటీ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఆ కమిటీ దరఖాస్తులను పరిశీలించి ముగ్గురు సభ్యులను ఎంపిక చేస్తారు. ఈ మూడు పేర్లలో ఒకరిని గవర్నర్ నియమిస్తారు. ఈ ప్రక్రియ అంతా జరగాలంటే కనీసం మూడు మాసాల సమయం పడుతుంది. ఇప్పటికి సెర్చ్ కమిటీల నియామకం జరగలేదు. దీంతో అది ఏర్పాటై కొత్త వైస్ ఛాన్సలర్ల నియామకం జరిగే వరకు ఇన్‌ఛార్జులతో నెట్టుకురావాల్సి ఉంటుంది.

జీతాలకూ తప్పని తిప్పలు

రెగ్యులర్ వైస్ ఛాన్సలర్లు లేకపోవడంతో యూనివర్సిటీల్లో ఉద్యోగులకు జీతాలు చెల్లింపునకూ సమస్యలు తలెత్తుతున్నాయి. ఇప్పుడున్న తాత్కాలిక వైస్ ఛాన్సలర్లకు పూర్తి అధికారాల్లేవు. ఏదైనా ఆర్థికపరమైన అంశాలపై నిర్ణయం తీసుకునే అధికారముండదు. దీంతో ఉద్యోగులు, సిబ్బందికి వేతన ఇబ్బందులు తప్పడం లేదు. రెండు విశ్వవిద్యాలయాల్లో కలిపి రెండు వేల మంది వరకు ఉద్యోగులున్నారు. వారికి ఇప్పటి వరకు వేతనాలు అందలేదు. వచ్చే నెలలో రావాలంటే కూడా ఇప్పుడున్న వైస్ ఛాన్సలర్లకు అధికారాలుండవు. ప్రదానంగా జూన్ మాసంలో ఉద్యోగులు, సిబ్బందికి రుణాలు తీసుకోవాలంటే వైస్‌ఛాన్సలర్, రిజిస్ట్రార్ల ఆమోదం పొందాల్సి ఉంటుంది. పెన్షనర్ల అరియర్సుపైనా సంతకాలు జరగాల్సి ఉంది. మొదటి త్రైమాసికంకు సంబంధించి ఆర్థికపరమైన అనుమతులు ఉన్నప్పటికీ రెండో త్రైమాసిక ఆర్థిక అనుమతులు రెండు విశ్వవిద్యాలయాల్లోనూ తీసుకుని లేదు. ఇక ఇప్పుడు ఎంసెట్ కౌన్సిలింగ్‌లు జరుగుతున్నాయి. అందులో కళాశాలలో సీట్ల కేటాయింపుల్లో ఏదైనా సమస్యలుంటే వాటిని పరిష్కరించాలంటే కూడా వైస్‌ఛాన్సలర్ ప్రధానం. ఆ అధికార స్థానం ఖాళీగా ఉండడంతో సమస్యలు నెలకొన్నాయి. ప్రభుత్వం ఎప్పటికి ఛాన్సలర్ల నియామకం చేపడుతుందో అని అటు ఉద్యోగులు, ఇటు విద్యార్థులు ఎదురు చూస్తున్నారు.

2023 సెప్టెంబర్ నెలలో నిర్మాణ దశ(ఫైల్)



ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న వైద్య కళాశాల

3 ఏళ్లు..10 శాతం పనులు..!

- కొనసా.....గుతున్న పెనుకొండ మెడికల్ కళాశాల నిర్మాణ పనులు
- భూమిచదును, పునాదుల నిర్మాణంతోనే సరి..
- నిర్ధేశించిన గడువు పూర్తయినా స్లాబ్ దశ పూర్తికాని వైనం
- కొత్త ప్రభుత్వమైనా పనులను వేగవంతం చేసేనా .?

నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సదుపాయాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో మెడికల్ కళాశాలను ప్రతి పార్లమెంట్ నియోజకవర్గానికి ఒకటి చొప్పున మంజూరు చేసింది. ఇందులో భాగంగా హిందూపురం పార్లమెంట్ పరిధికి సంబంధించి పెనుకొండలో మెడికల్ కళాశాల పనులను మూడేళ్లా రెండు నెలల క్రితం అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేసి ఆర్భాటంగా ప్రారంభించారు. డిసెంబర్ 2023 నాటికి పూర్తి చేస్తామని ఆరోజు నిర్వహించిన సభలో హామీ ఇచ్చారు. శంకుస్థాపన జరిగి మూడేళ్లు దాటినా ఆ పనులు స్లాబ్ దశ కూడా పూర్తి కాలేదు. పనులు సాగుతున్న తీరు చూస్తే మరో మూడేళ్ల సమయం పట్టినా సందేహం లేదన్న భావన ప్రజల్లో వ్యక్తం అవుతోంది.



వైద్య కళాశాల నమూనా

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

పెనుకొండ పట్టణం మడకశిర రహదారిలోని గొర్రెల పెంపక క్షేత్రంలో 48.49 ఎకరాల భూమిని వైద్య కళాశాలకు కేటాయించారు. 2021 మే 31వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా వర్చువల్ పద్ధతిలో పెనుకొండ వైద్య కళాశాల నిర్మాణానికి అప్పటి ముఖ్యమంత్రి శంఖుస్థాపన చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు వైద్య కళాశాలల్లో కొన్నిచోట్ల పనులు పూర్తి అయినప్పటికీ పెనుకొండలో మాత్రం నత్తనడకన ఇంకా సాగుతూనే ఉన్నాయి. నిర్మాణ పనులు ప్రారంభం అయ్యి మూడేళ్ల పూర్తి అయినప్పటికీ పనులు వేగం పుంజు కోలేదు. గత ప్రభుత్వం నిధులు విడుదల జాప్యం చేయడంతోనే పనులు పుంజుకోలేదనే విమర్శలున్నాయి.

మూడేళ్లు దాటినా నత్తనడకనే పనులు

వైద్య కళాశాల నిర్మాణానికి రూ.475 కోట్ల అంచనా వ్యయంతో శ్రీకారం చుట్టారు. 100 మెడికల్ సీట్లు, 504 పడకల ఆస్పత్రి నిర్మాణం చేపట్టాల్సి ఉంది. నిర్మాణ టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టు సంస్థ 2021 జూన్‌లోనే పనులు మొదలు పెట్టింది. రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. టెండర్ల దశలోనే ఏడాదిన్నర సాగింది. టెండర్లు పూర్తి చేసి 2025 ఆగస్టు 2 నాటికి పూర్తి చేయాలని గడువు విధించారు. ప్రస్తుతం 6 బ్లాకులు, 3 ఫ్లోర్లతో మెడికల్ కళాశాల భవన నిర్మాణాలు ప్రారంభించారు. 250 మంది కార్మికులు ఇక్కడ పని చేస్తున్నా పనులు వేగవంతం కాలేదు. ఇప్పటి వరకూ 10 శాతం పనులు పూర్తి అయినట్లు అధికారులు పేర్కొంటున్నారు. నిర్మాణ పనులు వేగం పెంచినట్లు నిర్మాణ సంస్థ చెబుతన్నా క్షేత్ర స్థాయిలో మాత్రం ఆ పరిస్థితి కన్పించడం లేదు.

వైద్య తరగతులు..పక్కనే వైద్య చికిత్సలు..

పెనుకొండలో నిర్మిస్తున్న వైద్య కళాశాల నుంచి ఏటా 100మంది వైద్య విద్యార్థులు చదువుకునే అవకాశం ఉంటుంది. నాలుగేళ్ల తరువాత వారంతా ఇక్కడే రెసిడెంట్ డాక్టర్లుగా పనిచేయాల్సి ఉంటుంది. వీరి కోసం నివాస గృహాలు ఇక్కడే ఏర్పాటు చేయనున్నారు. నర్సింగ్ విద్యార్థులూ ఇక్కడ శిక్షణ పొందాల్సి ఉంటుంది. దీంతో పాటు రెగ్యులర్ వైద్యులు, సిబ్బంది ఉంటారు. అదే విధంగా రక్త నిధి కేంద్రం, అత్యవసర చికిత్సలు అందిస్తారు.

మంత్రులు చొరవ చూపాలి





రాష్ట్రంలో ఇటీవల వైసిపి ప్రభుత్వం దిగిపోయి ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చింది. ఇందులో భాగంగా శ్రీసత్యసాయి జిల్లా నుంచి ఇద్దరు మంత్రులు రాష్ట్ర క్యాబినెట్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అందులోనూ ఒకరు పెనుకొండ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన సవితమ్మ కాగా, మరొకరు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్. ఇద్దరు మంత్రుల పరిధిలోకే ఈ వైద్యకళాశాల నిర్మాణం వస్తుంది. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తన శాఖే కాబట్టి ఎప్పటికప్పుడు పనుల పురోగభివృద్ధిపై చర్చించాలి. మరో మంత్రి సవిత పెనుకొండ స్థానిక ఎమ్మెల్యే కావడంతో మెడికల్ కళాశాల నిర్మాణాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి గడువు లోపు కళాశాల నిర్మాణం పూర్తి చేసేందుకు కృషి చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. వైద్య కళాశాల నిర్మాణం పూర్తియితే పేదలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి వస్తుంది.

2025-2026లో ప్రారంభమైయ్యేనా?

వైసిపి ప్రభుత్వంలో మెడికల్ కళాశాల నిర్మాణం పనులను 2023 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని నిర్ధేశించింది. నిధుల విడుదల జాప్యం కారణంగా పనులు వేగం పుంజుకోలేదు. కొత్తగా ఏర్పాడిన తెలుగుదేశం ప్రభుత్వం మెడికల కళాశాల నిర్మాణాలపై దృష్టి సారించి, పనులను వేగవంతం చేసి పూర్తి చేయాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందనే భావన ప్రజల నుంచి వ్యక్తం అవుతోంది. శంకుస్థాపన సమయంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న 12 వైద్య కళాశాలల్లో 2024లో అడ్మిషన్లు ప్రారంభిస్తామని ప్రకటించారు. పనులు వేగం అందుకోకపోవడంతో 2025-2026 నాటికి కళాశాలను ప్రారంభిస్తామని తేదీని పొడిగించారు. ప్రస్తుతం జరిగిన నిర్మాణ పనులను చూస్తుంటే మరో మూడేళ్లు గడిస్తేగానీ కళాశాలు పూర్తి అయ్యే అవకాశం కనిపించడం లేదు. అది కూడా పూర్తి స్థాయిలో నిధులు వచ్చి, నిరంతరం పనులు జరిగితేనే పనులు పూర్తవుతాయి. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో అయినా మెడికల్ కళాశాల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తిచేసి ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

నాణ్యమైన విద్య అందించాలి : కలెక్టర్



ప్రధానోపాధ్యాయురాలితో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-ఆత్మకూరు

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. ఆత్మకూరు మండలం వడ్డుపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఉదయం తనిఖీ చేశారు. పాఠశాలలో ఎంతమంది పిల్లలు ఉన్నారు.. మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనం తదితర వివరాలను ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవితో అడిగి తెలుసుకున్నారు. అన్ని తరగతుల విద్యార్థులను ఒకే చోట కూర్చోబెట్టి బోధించడం వలన ఏ విధంగా వారికి అర్థమవుతుందని, ఉపాధ్యాయుల కొరత ఉంటే ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం భర్తీ చేసుకుని పిల్లలకు న్యాయం చేసే విధంగా చూడాలన్నారు. విద్యార్థులకు అందించే కోడిగుడ్లకు ఎటువంటి కలర్ కోడింగ్ లేకుండా ఎందుకు ఉన్నాయన్నారు. కోడిగుడ్లు తీసుకునే సమయంలో కోడింగ్ లేకుండా ఏ విధంగా తీసుకుంటారని హెచ్‌ఎం, ఎండిఎం ఏడి నాగరాజును ప్రశ్నించారు. భవిష్యత్తులో ఇలా జరగకుండా చూడాలన్నారు. నాడు-నేడు పనులనూ ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎండిఎం ఎండి నాగరాజు, డిఒఇఒ శ్రీనివాసరావు, ఎంఇఒలు నరసింహారెడ్డి, రామాంజనేయులు, పంచాయతీ సెక్రెటరీ సునియాన్, సర్పంచి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథం అవసరం : జెవివి



జెవివి సభ్యత్వ నమోదును అందిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వైజ్ఞానిక సమాజం నిర్మాణం కోసం విద్యార్థి దశ నుండే శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్ తెలియజేశారు. జన విజ్ఞాన వేదిక నగర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నాడు నగరంలోని కెఎస్‌ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో జరుగుతున్న కొన్ని అశాస్త్రీయ సంఘటనలకు కారణం ప్రజల్లో శాస్త్రీయ చైతన్యం లేకపోవడమే అన్నారు. ఇలాంటి వాటిని ఎదుర్కోవాలంటే విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ దక్పథం అలవర్చుకోవాలన్నారు. జెవివి నగర గౌరవాధ్యక్షురాలు డా॥పి.ప్రసూన మాట్లాడుతూ కొంతమంది బాబాల అవతారం ఎత్తి అమాయక ప్రజల బలహీనతలను ఆసరాగా చేసుకుని వారి మానప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని చెప్పారు. ఇటీవల ఉత్తరప్రదేశ్‌లో జరిగిన సంఘటన ఇలాంటిదే అన్నారు. ఇలాంటి వాటి పట్ల పూర్తి స్థాయిలో చైతన్యం కలిగి ఉండి దొంగబాబాల నిజస్వరూపాన్ని ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ పి.శంకరయ్య జెవివి సభ్యత్వాన్ని తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గాంగే నాయక్, విజయలక్ష్మి, లలిత, నగర అధ్యక్ష, కార్యదర్శులు వీరరాజు, రామిరెడ్డి నాయకులు లక్ష్మీనారాయణ, రామకృష్ణ, ప్రసాద్ రెడ్డి, పాల్గొన్నారు.

మొహర్రంను ప్రశాంతంగా నిర్వహించుకోండి : డీఎస్పీ

ప్రజాశక్తి-పుట్లూరు

మండల వ్యాప్తంగా గ్రామాల్లో మొహర్రం వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని అనంతపురం రూరల్ డీఎస్పీ గ్రామస్తులకు సూచించారు. మొహర్రం (పీర్ల పండుగ) నేపథ్యంలో శుక్రవారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన పీర్ల పండుగ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. వేడుకల్లో ఎలాంటి గొడవలకు పాల్పడకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుంటే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సిఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ హేమాద్రి, పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

వైఎస్.జగన్‌ను కలిసిన ఆలమూరు శ్రీనివాస రెడ్డి



జగన్మోహన్‌రెడ్డికి వివాహ పత్రిక అందిస్తున్న ఆలమూరు శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి -అనంతపురం

మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డిని మాజీ ఎంపిపీ ఆలమూరు శ్రీనివాస రెడ్డి కలిసిశారు. గురువారం నాడు విజయవాడ తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో జగన్ మోహన్ రెడ్డిని కలిసి ఆగస్ట్ 16న అనంతపురం నగరంలో జరగనున్న తన కుమార్తె వివాహానికి రావాలంటూ ఆహ్వాన పత్రికను అందించారు. కాబోయే నూతన వధూవరులకు జగన్ ముందస్తుగా శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కొంతసేపు జిల్లాలో రాజకీయ పరిస్థితిని జగన్ అడిగి తెలుసుకున్నారు.



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో అనంత లక్ష్మి ఉపాధ్యాయ బృందం

డిప్లొమా ఫలితాల్లో 'అనంతలక్ష్మి' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-అనంతపురం

అనంతలక్ష్మీ ఇంజినీరింగ్ కళాశాలలో డిప్లొమా స్థాపించిన మొదటి సంవత్సరంలోనే విద్యార్థులు ప్రతిభ చాటారని కళాశాల ఛైర్మన్ అనంతరాముడు, ప్రిన్సిపాల్ డా॥ఎన్.రామమూర్తి తెలిపారు. ఇసిఇ, సిఎస్ఇ బ్రాంచ్‌ల్లో 90 శాతం అత్యధిక మార్కులతో ఫలితాలు సాధించారన్నారు. అనంతలక్ష్మి కళాశాల విద్యార్థులకు కొత్త సాంకేతికతను అలవరచు కోవడానికి కావాల్సిన అన్ని సౌకర్యాలనూ కల్పిస్తోందన్నారు. నూతన సాంకేతిక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి కమ్యునికేషన్ స్కిల్స్, ఆంగ్ల భాష నైపుణ్యాలను అభివద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు మొమెంటోలు, నగదు బహుమతులు అందచేసి ప్రోత్సహించారు. కళాశాల వైస్ ఛైర్మన్ రమేష్ నాయుడు, నైపుణ్యాభివృద్ధి సంచాలకులు డా॥ఎం.సురేంద్ర నాయుడు, పురుషోత్తం, శ్రీ హరినాథ్ పాల్గొన్నారు.

నాన్ జ్యుడిషియల్ స్టాంప్స్ అందుబాటులో ఉంచాలి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

విద్యార్థులు, నిరుద్యోగ యువత, ప్రజలకు అవసరమైన రూ.10, రూ.20 నాన్ జ్యుడిషియల్ స్టాంపులను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ యునైటెడ్ సిటిజన్ ఫోరం అనంతపురం ప్రధాన కార్యదర్శి ఎజి.రాజమోహన్, కార్యదర్శి పి.శ్రీనివాసరావు, న్యాయవాది సత్యానారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నాడు స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ జిల్లా డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ జనరల్ (డిఐజి)ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫోరం నాయకులు మాట్లాడుతూ నాన్ జ్యుడీషియల్ స్టాంప్స్ తక్కువ ధరలకు సంబంధించినవి అందు బాటులో లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. తప్పని పరిస్థితుల్లో రూ.100, రూ.200 ఆపై విలువజేసే నాన్ జ్యుడీషియల్ స్టాంపులను కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. ఈ అనవసర ఖర్చులను దృష్టిలో పెట్టుకుని అధికారులు తక్కువ ధరలు కలిగిన నాన్ జ్యుడీషియల్ స్టాంపులను రిజిస్టర్ కార్యాలయాల్లో , పోస్టాఫీసుల్లో అందుబాటులో ఉంచాలని కోరారు. స్పందించిన డిఐజి త్వరలోనే వాటిని అందుబాటులో ఉంచుతామని తెలియజేశారు.

అనంతలో సినీతారల సందడి


- సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ప్రారంభం
- పాల్గొన్న నిధిఅగర్వాల్, అనసూయ



సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న సినీతారలు నిధిఅగర్వాల్, అనసూయ

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురంలో సినీతారలు సందడి చేశారు. శుక్రవారం ఉదయం అనంతపురం సుభాష్‌రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన సౌత్ ఇండియా షాపింగ్ మాల్ 35వ షోరూం ప్రారంభోత్సవంలో సినిమా నటి నిదిఅగర్వాల్, నటీ, యాంకర్ అనసూయ భరద్వాజ్ పాల్గొన్నారు. వీరితో పాటు అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మినారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, సంస్థ అధినేతలు పి.వెంకటేశ్వర్లు, ఎస్.రాజమౌళి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నిధి అగర్వాల్, అనసూయ భరద్వాజలు సంయుక్తంగా జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఇద్దరూ షోరూమ్‌లో ఉంచిన వైవిధ్యభరిత వస్త్రశ్రేణిని సందర్శించి ప్రశంసించారు. ఈ సందర్భంగా నిధి అగర్వాల్ మాట్లాడుతూ వసిస్తున్న అన్ని తరాల, తరగతుల కుటుంబ సభ్యుల అభిరుచులకు అనుగుణంగా అనంతపురం నగరంలో సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌ను అందుబాటులోకి తెచ్చారన్నారు. అనసూయ భరద్వాజ మాట్లాడుతూ, నాణ్యతకు, వెరైటీలకు సౌత్ ఇండియా షాపింగ్ మాల్ చిరునామాగా ఉంటుందన్నారు. ఇక్కడ షాపింగ్ చేయటం ప్రతిసారీ ఓ వినూత్న అనుభూతిని కలిగిస్తుందని తెలిపారు. సౌత్ ఇండియా షాపింగ్ మాల్ డైరెక్టర్లు సురేశ్ శీర్ణ, రాకేష్, అభినయ్, కేశవ్ మాట్లాడుతూ ఆనంతపురం, పరిసర ప్రాంతాల్లో ప్రజల అభిరుచుల మేరకు సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌ను ఏర్పాటు చేశామన్నారు. నాణ్యత, విశ్వసనీయతకు పెద్దపీట వేస్తూ వస్త్రాభరణాలను ప్రజలకు అందిస్తామన్నారు. కంచి, ధర్మవరం, అరణి, ఉప్పాడ, పోచంపల్లి, గద్వాల మొదలైన అన్ని రకాల వస్త్రాలు తమ వద్ద అందుబాటులో ఉంటాయన్నారు. మెన్స్ వేర్, ఆధునాతన బ్రాండ్స్ ఉన్నాయన్నారు. చుడీదార్, లెవాంగాస్, లెగ్గింగ్స్, కిన్స్వేర్, లేడీస్ వెస్టర్న్ వేర్, లేటెస్ట్ ఫ్యాషన్స్‌కు చెందిన అన్నిరకాల ట్రెండీ బ్రాండ్స్‌ను అందుబాటులో ఉంచామన్నారు. కాగా షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి సినీతారలు రావడంతో వారిని చూసేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు వచ్చారు. నిది అగర్వాల్, అనుసూయతో యువకులు కరచాలనం చేసేందుకు పోటీ పడ్డారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీ అంబికా, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

బాలయ్య 50 వసంతాల సినీ స్వర్ణోత్సవ సంబరాలు



నందమూరి బాలకృష్ణకు బ్రోచర్ అందిస్తున్న జగన్

ప్రజాశక్తి అనంతపురం

సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ 50 వసంతాల సినీ స్వర్ణోత్సవాల సంబరాలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎన్‌బికె హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షులు జగన్ తెలిపారు. 1974 తాతమ్మ కల చిత్రంతో బాలకృష్ణ నందమూరి తారకరామారావు నట వారసునిగా చిత్ర సీమలో అడుగు పెట్టారన్నారు. అద్భుత నటనతో అంచెలంచెలుగా ఎదిగి తండ్రికి తగ్గ తనయుడుగా ప్రజల మన్ననలు పొందారన్నారు. బాలయ్య సినీ ప్రస్థానం 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు చెప్పారు. బాలయ్య అభిమానులను ఒక బృందంగా ఏర్పాడి 50 రోజుల పాటు పెద్దఎత్తున ఈ కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమ కూడా హైదరాబాద్‌లో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని చెప్పారు.

రోడ్డు గుంతలు పూడ్చివేత

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మినారాయణ, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, మాజీ జెడ్పీటీసీ కె.రామలింగా రెడ్డి అభిమానంతో మండల పరిధిలోని పసులూరు గ్రామ రోడ్డుపై గుంతలను టిడిపి కార్యకర్తలు గురువారం సొంత ఖర్చులతో పూడ్చారు. ఈ సందర్భంగా తలారి పవన్‌కుమార్, తలారి హరికృష్ణ, తలారి రమేష్ మాట్లాడుతూ పసులూరు గ్రామానికి వెళ్లే రహదారి పది కిలోమీటర్ల మీద గుంతలు ఏర్పడి రాకపోకలకు వాహన దారులకు ఇబ్బందులు తలెత్తు తున్నా యన్నారు. ఈ నేపథ్యంలో రూ.50 వేలు ఖర్చు చేసి గుంతలకు మట్టిని వేసి పూడ్చినట్లు తెలియ జేశారు.



గుంతలను పూడుస్తున్న టిడిపి కార్యకర్తలు



కార్మికుల సమస్యలపై మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కోవిడ్, మలేరియా, గార్బేజ్, క్లాప్ ఆటో డ్రైవర్లకు 3 నెలలుగా బకాయి ఉన్న వేతనాలను తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో కమిషనర్ మేఘస్వరూప్‌కు వినతిపత్రం సమర్పించారు. సమాన పనికి సమాన వేతనం, విడివిడిగా ఉన్న వారందరినీ కలిపి ఒక్కరే వేతనం ఇవ్వడం, ఈఎస్ఐ, పిఎఫ్, సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, చనిపోయిన కార్మికుడి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, తదితర సమస్యలను పరిష్కరించాలని, లేనిచో జరగబోయే పరిణామాలకు మీరే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు 1వ నగర కమిటీ కార్యదర్శి వెంకటనారాయణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఏటీఎం నాగరాజు, నగర కార్యదర్శి సాకే తిరుమలేష్, రాఘవ, జిల్లా కోశాధికారి బత్తల ఆదినారాయణ, గార్బేజ్ కార్మికులు రామన్న, కోవిడ్ కార్మికులు నారాయణస్వామి, లక్ష్మయ్య, మలేరియా యూనియన్, క్లాప్ ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



'మార్పు మనమే' పాట పోస్టర్ ఆవిష్కరిస్తున్న అన్నే ఫెర్రర్, మాంచూ, విశాల ఫెర్రర్,

'మార్పు మనమే' పాట పోస్టర్ ఆవిష్కరణ

అనంతపురం : ఆర్డీటీ స్త్రీ శక్తి ప్రాజెక్ట్‌లో భాగంగా 'నేనూ శక్తిని' అనే ప్రచార కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా ప్రముఖ గాయనీ, గాయకులతో 'మార్పు మనమే' గీతాన్ని రూపొందించారు. ఈ పాటలో మహిళా సాధికారత, అభివృద్ధి, అవకాశాలు, వారిలో సాధించగల సామర్థ్యం, తదితర అంశాలను జోడించారు. పోస్టర్‌ను శుక్రవారం మధ్యాహ్నం ఆర్డీటీ ప్రధాన కార్యాలయంలో ఇతర డైరెక్టర్ల సమక్షంలో ఆర్డీటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నే ఫెర్రర్ విడుదల చేశారు. ఈ గీతాన్ని ప్రముఖ గాయకులు గీత మాధురి, రామ్ మిరియాల, సమీరా భరద్వాజ్, ఇంద్రావతి చౌహాన్, అదితి భావరాజు ఆలపించారు. అన్నే ఫెర్రర్ మాట్లాడుతూ మహిళలపై ఇటువంటి మంచి పాటను విడుదల చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ గీతాన్ని యూట్యూబ్‌లో 'మార్పు మనమే' అన్న పేరుతో విడుదల చేశారు. కార్యక్రమంలో ఆర్డీటీ మహిళా సాధికారత డైరెక్టర్ విశాల ఫెర్రర్, చైర్‌పర్సన్ తిప్పేస్వామి, ఇతర డైరెక్టర్లు రాజశేఖర్ రెడ్డి, లీల సుజిత్, కృష్ణవేణి, సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పచ్చదనాన్ని కాపాడుదాం

బ్రహ్మసముద్రం : ప్రభుత్వ, ప్రయివేటు సెక్టార్లలో ప్రతిఒక్కరూ విరివిగా మొక్కలు నాటి పచ్చదనాన్ని కాపాడుదామని కొండాపురం పంచాయతీ సర్పంచి వనితమల్లికార్జున పిలుపునిచ్చారు. మండలంలోని సంతే కొండాపురం, సూగేపల్లి గ్రామాల్లో శుక్రవారం సర్పంచి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అంగన్వాడీ కేంద్రంలో పిల్లల అన్నప్రాస కార్యక్రమం చేపట్టి అనంతరం కేంద్రం ముందు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శాంతి, పంచాయతీ కార్యదర్శి అనిత, ఎమ్మెల్ హెచ్పి సల్మా, ఏఎన్ఎం నిర్మల, అంగన్వాడి వర్కర్ శాంతి కుమారి, క్లస్టర్ ఇంచార్జ్ ఓబులేష్, మంజు పాల్గొన్నారు.

పశువుల్లో చర్మవ్యాధి నివారణకు టీకా

రాయదుర్గం రూరల్ : మండలంలోని జుంజురంపల్లిలో శుక్రవారం 250 పశువులకు ముద్ద చర్మవ్యాధికి టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి నారాయణ రెడ్డి తెలిపారు. రాయంపల్లి, బిఎన్.హళ్లి, ఆవులదట్ల, చదం, మల్లాపురం, నాగిరెడ్డిపల్లి, వేపరాల గ్రామాల్లో సుమారు 4,235 పశువులకు టీకా వేశామన్నారు. రైతు సేవా కేంద్రంలో టీకా అందుబాటులో ఉంచామని, ప్రతి రైతు తమ పశువులకు తప్పనిసరిగా వేయించాలన్నారు. పశుగ్రాసం వారోత్సవాల్లో భాగంగా పాడి రైతులకు పశుగ్రాసం ప్రాముఖ్యతను తెలిపారు. ప్రభుత్వం 75 శాతం సబ్సిడీతో గడ్డి విత్తనాలు సరఫరా చేస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచి వన్నూరుస్వామి, తిమ్మారెడ్డి, పశు వైద్య సిబ్బంది తాహిర్, కళ్యాణి, రాజు, రాఘవేంద్ర, మేఘన, దయానంద పాల్గొన్నారు.

పిల్లలపల్లి పాఠశాల తనిఖీ

బ్రహ్మసముద్రం : మండల నోడల్ అధికారి వేణుగోపాల్‌రెడ్డి శుక్రవారం మధ్యాహ్నం పిల్లలపల్లి జడ్పీ హైస్కూల్‌ను సందర్శించి ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, రికార్డులను పరిశీలించారు. హెచ్ఎం అశోక్ స్కూల్ వివరాలు, సమస్యలను ఆయనకు విన్నవించగా నివేదిక తయారు చేసి కలెక్టర్‌కు పంపినట్లు నోడల్ అధికారి తెలిపారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి విద్యార్థులతో ముచ్చటించారు. ఆయన వెంట ఎంపీడీఓ ఎస్.దాసానాయక్, ఎంఇఒ కృష్ణానాయక్, ఎఒ నందకిషోర్, ఎపిఒ అవినాష్, పంచాయతీ కార్యదర్శి కవిత ఉన్నారు.

ట్రాఫిక్ నియమాలపై అవగాహన

అనంతపురం : నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపల్ డాక్టర్ పి. శంకరయ్య అధ్యక్షతన ఎన్ఎస్ఎస్, జిల్లా న్యాయ సహకార సంస్థ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వచించారు. ముఖ్యఅతిథి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జి.శివప్రసాద్‌యాదవ్ ట్రాఫిక్ నియమాల ఉల్లంఘన వల్ల కలిగే నష్టాలు, జరిమానాల గురించి విద్యార్థులకు వివరించారు. అడ్వకేట్ ఎస్.హరికృష్ణ ట్రాఫిక్ విధి విధానాలు, లైసెన్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు బి.రామకృష్ణ, ఎస్.ఫాతిమాబేగం, బివి.రమణనాయుడు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు, పురుగుమందులు అమ్మితే చర్యలు

వజ్రకరూరు : మండల వ్యాప్తంగా ఫర్టిలైజర్ షాపుల యజమానుల పూర్తిస్థాయిలో లైసెన్స్ కలిగిన పురుగు మందులు, విత్తనాలను మాత్రమే అమ్మాలని, నకిలీలకు అవకాశం ఇవ్వరాదని ఉరవకొండ ఏవో శుభకర్ స్పష్టం చేశారు. ఆయన శుక్రవారం ఉరవకొండలో ఫర్టిలైజర్ షాపుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇచ్చిన ప్రతి వస్తువుకు రైతులకు తప్పనిసరిగా రైతులకు బిల్లు ఇవ్వాలని, అలాగే రికార్డుల్లో చూపాలని లేనిచో చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి రికార్డును కచ్చితంగా పొందుపరచాలని, షాపు ముందు ధరల పట్టికను ఉంచాలన్నారు.

'అమ్మ పేరుతో ఒక మొక్క నాటండి'

రాయదుర్గం రూరల్ : స్థానిక కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం 'అమ్మ పేరుతో ఒక మొక్క నాటండి' కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ రఘురామ్మూర్తి మాట్లడుతూ కళాశాలలో విద్యార్థులు మొక్కలు నాటి వాటిని అమ్మలాగా చూసుకుంటామని మాటిచ్చారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, అధ్యాపకులు లక్ష్మీనారాయణ, బాబు, పద్మావతి, ఎన్ఎస్ఎస్ అధికారులు నారాయణ, నాగప్ప, వాలంటీర్లు పాల్గొన్నారు.

కుళ్లాయిస్వామి సన్నిధిలో ఆకుల బాబు

నార్పల : మండలంలో వెలసిన గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం టిడిపి నాయకులు ఆకుల విజయ్ కుమార్(బాబు) కుటుంబ సభ్యులతో కలిసి గూగూడు కుళ్లాయిస్వామిని, ఆంజనేయస్వామిలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్థానిక టిడిపి నాయకులు ఆకుల బాబుకు ఘన స్వాగతం పలికారు. ఆకుల బాబుతో పాటు ఆకుల కిషోర్, నాయకులు నర్సింహులు, ఓబులేసు, ప్రదీప్‌కుమార్ ఉన్నారు.

మొక్కల పెంపకంతో కాలుష్యం దూరం

బెళుగుప్ప : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షిస్తే వాతావరణం నుంచి కాలుష్యం దూరమవుతుందని పశు వైద్యాధికారి డాక్టర్ రమేష్ తెలిపారు. స్థానిక పశు వైద్య కేంద్రం ఆవరణలో శుక్రవారం ఆయన వైద్య సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. డాక్టర్ రమేష్ మాట్లాడుతూ పశుసంపద కలిగిన ప్రతి ఒక్కరూ సుభాబుల్, అవిష మొక్కలు నాటితే అవి కరువు కాలంలో మేతగా కూడా పనికొస్తాయన్నారు.

మాతా, శిశు మరణాలను అరికట్టాలి

ప్రజాశక్తి-అనంతపురం

డిఎంహెచ్ఒ డాక్టర్ ఈబి.దేవి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ డా. ఈబి. దేవి

జిల్లా వ్యాప్తంగా మాతా, శిశు మరణాలను పూర్తిస్థాయిలో అరికట్టాలని డిఎంహెచ్ఒ డా. ఈబి. దేవి ఆదేశించారు. గత నెలలో జిల్లాలో చోటుచేసుకున్న మాతా, శిశు మరణాలకు గల కారణాలపై శుక్రవారం డిఎంహెచ్ఒ అధ్యక్షతన ఆ ప్రాంత వైద్యులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. డిఎంహెచ్ఒ మాట్లాడుతూ ఒకవేళ మాతా, శిశు మరణాలు సంభవిస్తే మరణానికి కారణాలు తెలుసు కొని మరోసారి అలాంటి కారణంతో మరణం జరగకుండా వైద్యులు, సిబ్బంది తగిన చర్యలు తీసుకోవా లన్నారు. గర్భిణులు ప్రసవం తర్వాత తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గర్భిణులు పౌష్టికాహారం సంపూర్ణంగా తీసుకొనేలా ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారులు, సిబ్బంది చూడాలని ఆదేశించారు. ప్రతి గర్భిణ 12 వారాల లోపు రిజిస్టర్ చేసుకొని అన్నిరకాల వైద్య పరీక్షలు, వైద్యసేవలు అందించాలన్నారు ప్రమాదకర లక్షణాలు వున్న గర్భిణుల పట్ల తగిన జాగ్రతలు తీసుకొంటూ సుఖ ప్రసవం జరిగేలా చూడాలని ఆదేశించారు. ఆశా డే రోజున పిహెచ్‌సి డాక్టర్స్, వైద్య సిబ్బంది గర్భిణులు, తల్లి, బిడ్డకు సంబంధించిన ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. అంతిమంగా ఏ శిశువు జన్మిస్తూ మరణించ కూడదు, ఏ తల్లి జన్మనిస్తూ మరణించ కూడదని తెలిపారు. సమావేశంలో డిసిహెచ్‌ఎస్ డా. డేవిడ్ సాల్మన్‌రాజ్, డా. యుగంధర్ డిఐఒ, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డా. శ్రీదేవి, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి డాక్టర్స్ డా.నవీన్ కుమార్, డా.ఇందిరాప్రియదర్శిని, డా. శంకర్‌నారాయణ, ఎంపిహెచ్ఇఒ లక్ష్మన్న, ఎంపిహెచ్ఎస్ హేమలత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'పేరుకే నాడు-నేడు.. పాఠశాలల్లో అన్నీ సమస్యలే' : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పుట్లూరు



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

వైసిపి ప్రభుత్వంలో పేరుకే 'నేడు-నేడు' కార్యక్రమం చేపట్టారని, పాఠశాలల్లో అన్నీ సమస్యలే అని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణపై హై కమాండ్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఎమ్మెల్యే శుక్రవారం మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. స్థానిక అంగన్ వాడీ కేంద్రం, మండల ప్రాథమిక పాఠశాల, ఆదర్శ పాఠశాల, హాస్టల్‌ను తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లలతో కాసేపు ముచ్చటించారు. ఆదర్శ పాఠశాల హాస్టల్‌లో పురుగులు పట్టిన కూరగా యలు, కాలం చెల్లిన సరుకుల వినియోగంపై హాస్టల్ వార్డెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పలుమార్లు హెచ్చరించినా ఏజెన్సీ నిర్వాహకులు పట్టించుకోవడం లేదని, తరచూ నాసిరకంగా అందిస్తున్నారని ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారని వార్డెన్ ఎమ్మెల్యేకి వివరించారు. బాలికల హాస్టల్‌ను సందర్శించి నాసిరకం భోజనం అందిస్తుండడంతో అధికారులపై మండిపడ్డారు. సిఎం చంద్రబాబు ప్రజలకు అందుబాటులోకి ఇసుక పాలసీ విధానాన్ని తీసుకురాగా ఓర్వలేని వైసిపి అసత్య ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. ఉచిత ఇసుక పాలసీపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే వెంట టిడిపి మండల కన్వీనర్ బాల రంగయ్య, సుదర్శన్‌నాయుడు, రామ మునిరెడ్డి, శివారెడ్డి, పెద్దిరాజు, వాసుదేవరెడ్డి, ఎల్‌కె.చెన్నారెడ్డి, రామచంద్రరెడ్డి, రవికుమార్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, శ్రీనివాసులునాయుడు, రవికుమార్, తాజ్, నారాయణస్వామి ఉన్నారు.

కొత్త క్రిమినల్ చట్టాలతో ప్రమాదం: ఐలు

ప్రజాశక్తి-అనంతపురం అర్బన్



మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త క్రిమినల్ చట్టాలు ప్రమాదకరంగా ఉన్నాయని ఎఐఎల్‌యు జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు సుంకర రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన నూతన క్రిమినల్ చట్టాలపై 'ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్' (ఐలు) అనంతపురం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నాడు అనంతపురం జిల్లా కోర్టు ఆవరణలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కొత్త చట్టాలపై పౌర సమాజానికి, న్యాయవాదులకు లోతైన పరిశీలన అవసరమని చెప్పారు. బార్ కౌన్సిల్ సభ్యుడు రామ్‌రెడ్డి, అనంతపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురు ప్రసాద్ మాట్లాడుతూ బెయిల్ మంజూరులో మార్గదర్శకాలు, పోలీసు అధికారులను ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్లుగా పరిగణించడం, జ్యుడిషియరీ అధికారాలు నియంత్రించేలా నూతన చట్టాలు ఉన్నాయన్నారు. కొత్త చట్టాల అమలు ద్వారా న్యాయవాదులకు పలు సవాళ్లు ఎదురుకానున్నాయని తెలిపారు. చట్టాలు రూపొందించే ప్రక్రియ సక్రమంగా జరగలేదని, శాస్త్రీయమైన చర్చ లేకుండా రూపొందించిన చట్టాల వల్ల పౌరసమాజానికి అనర్థం జరుగుతుందని భావించారు. ప్రమాదకరమైన అంశాలను తొలగించడానికి, సవరించడానికి ఉద్యమించాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. లేనిపక్షంలో భవిష్యత్తు రోజుల్లో ప్రజాస్వామ్య హక్కులను హరించటానికి, పాలకులకు ఈ చట్టాలు ఉపయోగపడతాయనే విషయాన్న గుర్తించాలని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సతీష్, జిల్లా అధ్యక్షుడు వీరయాదవ్, రాష్ట్ర కమిటీ సభ్యులు సూర్యచంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు ప్రసాద్, ప్రకాష్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మద్యం మత్తులో ఘర్షణ.. ఒకరికి గాయాలు

నార్పల : మండలంలోని గూగూడు గ్రామంలో శుక్రవారం ఇద్దరు వ్యక్తులు మద్యం మత్తులో ఘర్షణ పడడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. బెంగళూరుకు చెందిన నాగరాజు, ధర్మవరం చెందిన శ్రీకాంత్ కుళ్లాయిస్వామి దర్శనార్థం గూగూడు వచ్చారు. ఇక్కడే అతిగా మద్యం తాగి వాదులాడుకున్నారు. గొడవ తీవ్రస్థాయికి చేరి శ్రీకాంత్ బీరు బాటిల్‌తో దాడి చేయగా నాగరాజు తలపై తీవ్ర గాయాలయ్యాయి. తీవ్ర రక్త స్రావం కావడంతో స్థానికులు 108 ద్వారా నాగరాజును స్థానిక ప్రాథమిక వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎక్కడికక్కడ రహదారులు దిబ్బంధం చేసి గాలింపు చర్యలు చేపట్టి నిందితుడు శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. అలాగే ఈ నెల 16, 17 తేదీల్లో గూగూడులో మద్యం అమ్మకాలను నిషేధించినట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం

కళ్యాణదుర్గం : మండలంలోని బట్టువానిపల్లి గ్రామానికి చెందిన రైతులు నరసింహులు, వెంకటేష్, మహేంద్రల తోటల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. వారు అందులోని విలువైన విద్యుత్ పరికరాలు, రాగి వైరును ఎత్తుకెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో గేదెలు మృతి

రాయదుర్గం : పట్టణ శివారులోని పై తోట వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదం లో రెండు గేదెలు, ఓ దూడ మృత్యువాత పడ్డాయి. రైతు బోయ ఆంజనేయకు చెందిన మూడు గేదెలు, ఓ దూడ శుక్రవారం తెల్లవారుజామున పైతోట వద్ద జాతీయ రహదారిపై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో రెండు గేదెలు, దూడ అక్కడికక్కడే మృతి చెందాయి. విషయం తెలుసుకున్న పశువైద్య సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని కొనఊపిరితో ఉన్న ఒక పశువుకి వైద్యం అందించారు. మృతిచెందిన వాటి విలువ రూ. 2.5 లక్షల నుంచి రూ. 3 లక్షల వరకూ ఉండవచ్చని స్థానిక పశువైద్యాధికారి సూర్యనారాయణరెడ్డి తెలిపారు.

నిందితులను శిక్షించాలి

రాయదుర్గం : నంద్యాల జిల్లాలో బాలికపై అత్యాచార ఘటనను నిరసిస్తూ శుక్రవారం వాల్మీకి సంక్షేమ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక మెయిన్ బజారులో వాల్మీకి విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. సమితి తాలూకా ఉపాధ్యక్షులు డాక్టర్ బోయ మల్లికార్జున, జాయింట్ సెక్రటరీ పవన్ కుమార్, పైగేరి హమాలీ యూనియన్ అధ్యక్షులు కురుబ శ్రీనివాసులు, నాగరాజు, మల్లి, గంగాధర మాట్లాడుతూ ఘటన జరిగి 5 రోజులైనా నిందితులపై కఠిన చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. బాలిక శవాన్ని వెలికి తీసి తల్లిదండ్రులకు అప్పగించాలని, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే రాష్ట్ర వ్యాప్తంగా వాల్మీకి సామాజిక వర్గం ప్రజలు ఏకమై పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

తాడిపత్రి రూరల్ : 8 ఏళ్ల బాలిక పట్ల అమానుషంగా ప్రవర్తించి హత్య చేసిన నిందితులను ప్రభుత్వం వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని ఎపి రైతు సంఘం అనంతపురం జిల్లా కమిటీ సభ్యురాలు జి.శిరీష ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా, సమాజం పెడదోవ పట్టకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సోషల్ మీడియా, ఇతరత్రా వాటిపై ఆంక్షలు విధించాలన్నారు. బాలిక కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు.

రేపు ఎమ్మెల్యే కాలవకు సన్మానం

రాయదుర్గం : ఎపి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల సమితి ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ పట్టణంలోని కురిహినశెట్టి కళ్యాణ మండపంలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జెఎసి నాయకులు తెలిపారు. వారు శుక్రవారం స్థానిక సమైక్యాంధ్ర భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమవేశంలో ఎన్జీవో నాయకులు లక్ష్మీనారాయణ, కిషోర్, జీ.పరమేశ్వరప్ప, ఏపీటీఎఫ్ నేత టి.రామాంజనేయులు, యుటిఎఫ్ నేతులు వెంకటరామిరెడ్డి, హనుమంతరెడ్డి, ఎస్టియు నేత రంగనాథ్ పాల్గొన్నారు.



డిజిపిని కలిసిన జెఎల్.మురళీధర్, రాయల్ మురళి

డిజిపిని కలిసిన టిడిపి నాయకులు

అనంతపురం : రాష్ట్ర డిజిపి ద్వారక తిరుమలరావును శుక్రవారం మంగళగిరిలోని డిజిపి కార్యాలయంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి, అర్బన్ బ్యాంకు చైర్మన్ జెఎల్.మురళీధర్, రాయల్ మురళి, కాయగూరల శ్రీధర్ మర్యాదపూర్వకంగా కలిశారు. వారు డిజిపికి పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

'విద్యార్థులకు పెరుగన్నం'

పెద్దవడుగూరు : స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు అదనంగా పెరుగన్నం వడ్డించే కార్యక్రమాన్ని శుక్రవారం హెచ్ఎం సుధాకర్‌బాబు ప్రారంభించారు. తెలుగు యువత జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి చిన్నవడుగూరు దివాకర్‌రెడ్డి సహకారంతో ఇకపై రోజూ విద్యార్థులకు మెనూతో పాటు పెరుగన్నం అందిస్తామన్నారు. 600 మంది విద్యార్థులకు సొంత ఖర్చుతో పెరుగన్నం అందజేస్తున్నట్లు దివాకర్‌రెడ్డి తెలిపారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు

వజ్రకరూరు : సీజనల్ వ్యాధుల నివారణ ముందస్తు చర్యల్లో భాగంగా శుక్రవారం ఉరవకొండ పట్టణంలో డ్రై డే ఫ్రై డేపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు పంచాయతీ కార్యదర్శి గౌస్ సాహెబ్ తెలిపారు. శుక్రవారం అంబేద్కర్ నగర్‌లో కాలువలు, రోడ్లపై చెత్తను తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లి స్ప్రే చేయించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యం, పరిశుభ్రతపై ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది పలు సూచనలు ఇచ్చారని తెలిపారు.

వెండి గొడుగు వితరణ

గుత్తి : పట్టణంలోని మెయిన్ బజార్‌లో కొలువుదీరిన బారే హిమామ్ పీరుకి శుక్రవారం సాయి ముఖేష్ దంపతులు అరకిలో వెండి గొడుగును సమర్పించారు. మొహర్రం సందర్భంగా వారు వెండి గొడుగును బారే హిమామ్ పీర్ల చావిడిలో ముజావర్లకి అందజేశారు. కార్యక్రమంలో కోనా ప్రదీప్‌రెడ్డి, బాలప్ప, రవికుమార్ దంపతులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఐటిలో వరల్డ్ పేపర్ బ్యాగ్ డే

శింగనమల : వరల్డ్ పేపర్ బ్యాగ్ డే-2024 సందర్భంగా శుక్రవారం బుక్కరాయసముద్రం మండలంలోని రోటరీపురం గ్రామం వద్ద ఉన్న ఎస్ఆర్ఐటి కాలేజీలో వర్క్‌షాపు నిర్వహించారు. ఈ వర్క్‌షాపులో విద్యార్థులు పాత దిన పత్రికలను ఉపయోగించి తమ సృజనాత్మకతను వెలికితీసి వివిధ రకాల పేపర్ బ్యాగులు తయారు చేశారు. ఎస్ఎస్ వలి, అక్షయ, చక్రధర్ మొదటి మూడు బహుమతులు గెలుచుకున్నారు.

గూగూడులో విస్తృతంగా బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు

ప్రజాశక్తి-నార్పల



గూగూడులో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న శివయ్య

కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు గూగూడు గ్రామ గౌరవానికి సంబంధించినవి అని, స్వామి దర్శనార్థం సుదూర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు వస్తుంటారని, వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సర్పంచి రమణకుమారి శివయ్య పేర్కొన్నారు. భక్తుల రద్దీ క్రమేపీ పెరిగిందని, ముఖ్యంగా రెండో శనివారం, ఆదివా రం సెలవులు కావ డం అందులో ఆదివారం చిన్న సరిగెత్తు కావడంతో భక్తులు పెద్దఎత్తున వచ్చే అవకాశం ఉందన్నారు. పంచాయతీ ఆధ్వర్యంలో గ్రామంలో ఎక్కడికక్కడ తాగునీటి సౌకర్యం, పారిశుధ్యం నిర్వహణ, వీధి లైట్లు, తదితర ఏర్పాట్లు విస్తృతంగా చేస్తున్నామన్నారు. ఇంకా ఏమైనా అసౌకర్యాలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. సర్పంచి మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీక అయిన గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయడానికి అధికారులు, అనధికా రులు రాజకీయాలకు అతీతంగా గ్రామ పెద్దలు, గ్రామస్తుల సహకారం తీసుకుంటామని తెలిపారు.

నిరుద్యోగ యువతకు 'అభయ'ం

ప్రజాశక్తి-అనంతపురం



చిన్నారులతో అభయ ఫౌండేషన్ ప్రతినిధులు

బుక్కరాయసముద్రం మండలంలోని రోటరీపురం కేంద్రంగా పని చేస్తున్న అభయ సాధికారత ప్రాంగణంలో గ్రామీణ నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. అభయ సంస్థ 2006 నుంచి వేలాది మంది నిరుద్యోగ యువతకు ఉచిత ఉపాధి కల్పించడమే గాక, మరెన్నో సేవలు అందిస్తోంది. ప్రస్తుతం శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయి. ఆయుర్వేద థెరపిస్ట్, మొబైల్ రిపేరీ, డ్రైవింగ్, టైలరింగ్, బ్యుటీషియన్, కంప్యూటర్స్, హోమ్ కేర్ నర్సింగ్, శారీ టై అండ్ డై కోర్సుల్లో శిక్షణ ఇస్తారు. ఎంపిక చేసిన వారికి ఉచిత వసతి, భోజనం సౌకర్యం ఉంటుంది. శిక్షణ అనంతరం ధ్రువీకరణ పత్రం, టూల్ కిట్స్, తదితర వస్తువులను 50 శాతం సబ్సిడీపై అందిస్తారు. ఆసక్తి గల అభ్యర్థులు క్యాంపస్‌లో కానీ లేదా పవన్-7095537244, భార్గవ్-9701241487 కు ఫోన్ చేయవచ్చు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-బెళుగుప్ప

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో సుబ్బరాజు సూచించారు. ఆయన శుక్రవారం స్థానిక బీసీ కాలనీ, వినాయక కాలనీల్లో ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, పంచాయతీ సిబ్బందితో కలిసి ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. మురికి కాలువలు శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. అనంతరం సచివాలయం-2ను సందర్శించి సిబ్బంది హాజరు, బయోమెట్రిక్ అటెండెన్స్‌లను పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. విధులకు గైర్హాజరైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపిడిఒ వెంట విస్తరణ అధికారి మాధవరెడ్డి, పంచాయతీ సెక్రటరీ వెంకటేశులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

కెజిబివిలో నాణ్యమైన భోజనం అందించాలి

కెజిబివి విద్యార్థినులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీవో సుబ్బరాజు సూచించారు. ఆయన ఎంఇఒ పి.మల్లారెడ్డితో కలిసి స్థానిక కెజిబివిని సందర్శించి విద్యార్థినుల హాజరు, పాఠశాల రికార్డులను పరిశీలించారు. కాసేపు విద్యార్థినులతో ముచ్చటించారు. వారి వెంట పాఠశాల ఇన్‌ఛార్జి సుమియాబాను, ఉపాధ్యాయులు ఫరీద, ధనలక్ష్మి, సరితబాను, వందన ఉన్నారు.

నేడు పశుగ్రాసం వారోత్సవాలు

బెళగుప్ప : స్థానిక పశు వైద్య కేంద్రంలో శనివారం పశుగ్రాసం వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పశువైద్యాధికారి డాక్టర్ రమేష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళ్యాణదుర్గం ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఎన్.శ్రీనివాస్ గుప్తా హాజరై పాడి ఉత్పత్తిలో పశుగ్రాసం ప్రాముఖ్యతను వివరిస్తారని తెలిపారు. కావున రైతులు పాల్గొనాలని తెలిపారు.

అబ్దుల్ బాసిత్ రియాజి కన్నుమూత



అబ్దుల్ బాసిత్ రియాజి

రాయదుర్గం : పట్టణానికి చెందిన అబ్దుల్ బాసిత్ రియాజి(83) శుక్రవారం మధ్యాహ్నంలో బీపీ కారణంగా తుది శ్వాస విడిచారు. ఈయన గతంలో జమాయతే అహలే హదీస్ ఆంధ్రప్రదేశ్ సంస్థ శాఖకు ప్రెసిడెంట్, స్థానిక జామియా మహమ్మదీయ అరబిక్ కాలేజీ ప్రిన్సిపల్, జామియా మహమ్మదీయ మస్జీద్ ప్రెసిడెంట్‌గా పని చేశారు. ముస్లింలు ఒక పెద్ద ధార్మిక పండితుని కోల్పోయా రని పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పేర్కొన్నారు. ఈయన అంత్యక్రియలు శనివారం స్థానిక బళ్లారి రోడ్డులోని ఖబరస్థాన్‌లో జరుగుతాయని సహచరులు తెలిపారు.

ఉత్తమ విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి-పామిడి

స్థానిక టిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2023-24లో పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు పూర్వ విద్యార్థి సంఘం(1981-82బ్యాచ్) ఆధ్వర్యంలో శుక్రవారం నగదు బహుమతి అందజేశారు. మొదటి బహుమతిగా అబ్దుల్ సుబహాన్‌కు రూ. 10వేలు, రెండో బహు మతిగా మణిదీప్ కుమార్‌కు రూ. 7వేలను అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మోహన్, బాలాజీ, నరసింహులు, మైనుద్దీన్, జితేంద్ర, నాగేశ్వరరావు, కోకిలే భాస్కర్, ఎల్ఎన్.శ్రీనివాసులు, పత్రా శ్రీనివాసులు, హెచ్ఎం రామ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గడ్డి విత్తనాలు పంపిణీ

శింగనమల : మండల వ్యాప్తంగా వెటర్నరీ ఆసుపత్రుల్లో పశుగ్రాసం విత్తనాలు అందుబాటులో ఉంచామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎడి పద్మనాభం సూచించారు. స్థానిక పశువుల ఆసుపత్రిలో శుక్రవారం ఎడి రైతులకు గడ్డి విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు బండి వెంకటనారాయణ, సత్తి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

IN THE COURT OF THE MACT CUM HON'BLE XXIV ADDL. CHIEF JUDGE CITY CIVIL COURT, AT :: HYDERABAD
O.P.No. 2578 OF 2021

BETWEEN :
Ch.Goutam. ...Petitioner.
AND
Manjula Mahendra and others. ...Respondents.

To,
Manjula Mahendra, S/o. Manjula Jayappa, aged major, occ: Owner cum Driver of DCM Goods Carriage vehicle No. AP 02 TB 3039, R/o. 5-34-1, Peddagutla palli, O.D.C. Mandalam, Sunnampalle, Obuladevaracheruvu, Anantapur District, Andhra Pradesh 515 561.
...Respondent No.I.

Please take notice that the petitioner filed the above O.P. against you No.1 and other respondents for claiming compensation for the injuries sustained by the petitioner in a road accident which was occurred on 06/10/2021 at 06:30 PM at near HP petrol pump in the limits of P.S.Kalwakurthy. The said O.P. is posted to **07.08.2024** at **10:30** AM for your appearance and counter. Kindly make it convenient to be present on the said date before this Hon'ble Court by 10.30 AM in person or through your counsel, failing which the matter will be decided on your obsence. Hence this notice.

BY ORDER OF THE COURT
M. VIJAY REDDY
ADVOCATE
2-2-647/A/58, Saibabanagar.
Shivam Road, Bagh Amberpet
Hyderabad
Ph: 7673904549, 9330489999